స్కెచ్

# బాడిగ జీవితాలు

**అనిసెట్టి అప్పారావు**

వర్షం సామాన్య పౌరునికి విరోధి. కోటివెంకడు తన మట్టికొంప తలుపు తెరిచాడు. కళ్ళు చికిలించి ముఖానికి చెయ్యి అడ్డంపెట్టుకుని పైకి చూశాడు. ఆకాశం మూల్గుతోంది. వాన అన్ని వైపులా ముసురు కొస్తున్నది.

ఎక్కడో పిడుగుపడితే వసారాలోని గుఱ్ఱం అదిరిపడ్డది. చివాలునలేచి చెవులు రిక్కించి సకిలించింది. వాడు గడ్డిగంపని దాని దగ్గరికి లాగాడు. అది వాడి ఆప్తబంధువు. దోస్తు!

కోటివెంకడి ముఖంమీద ఛెడీమని కొట్టింది వాన జల్లు. తలమీదకి గోనె లాక్కున్నాడు. పచ్చిగావున్న మోకాటి లోతు బురదలోకి దిగాడు. కాళ్ళమీద జల్లెడలా పేరుకున్న నరాలు జిల్లుమని లాగాయి. కాళ్ళీడ్చుకుంటూ రోడ్డు ప్రక్క విడిచిన బండీదగ్గరికి పోయాడు. ఇరుసులో చక్రాల్లో వేళ్ళుపెట్టి కదిలించాడు. మేకులు సరిగ్గావున్నవి. వేళ్ళకయిన తారు గోనెకి రాసుకున్నాడు. వాడు ఆవులిస్తే ఎదుర్రొమ్ము పట్టుకుపోయి ఆవులింత అణిగిపోయింది.

వాన నల్లటిధారలు కడుతోంది. వాడు గోనె ముఖంమీదకి లాక్కున్నాడు. అది మదపువాసన కొడుతోంది. గుఱ్ఱం, గోనె, లద్దె, బండి, గడ్డి, రోడ్డూ సైడుకాల్వ ఇల్లూ ఏకమై పాడుకంపు. వాడు మళ్ళీ మోకాటి ఊబిలోంచి ఇంట్లోకి పోయాడు. జీనూ, సామాన్లూ తెచ్చి గుఱ్ఱానికి తగిలిస్తూ పెద్దగా అరిచాడు:

"గంజి పోస్తావా?"

లోపల వాడికూతురు ఏడుపుకి దిగింది. ఆ గోలలో వాడిభార్య ఏంచెప్పిందో వినపడలేదు. గంజిలేకపోతే, నాలిక పిడచగడితే వాడు భార్యని చితగ్గొడతాడు. తను జుట్టు పీక్కుంటాడు. అలాంటివి వినపడక పోవడమే మంచిది!

వాడు గుఱ్ఱాన్ని బైటికి లాక్కొస్తుంటే అది కాళ్ళతో తంతుంది. దాన్ని చెడామడా కొడతాడు. అది గావుకేకపెడుతుంది. అయినా దాని మొర ఎవడాలకిస్తాడు?

కోటివెంకడు బండికట్టాడు. ఇవాళ వాడి వొంట్లో కైపులేదు. "దీని దిబసమార!" వానని కాబోలు తిట్టుకున్నాడు. బీడీ ముట్టించి రెండు దమ్ములు లాగి, గుఱ్ఱాన్ని చెర్నకోలతో ఒక్క చరుపుచరిచాడు. అది గిలగిల కొట్టుకుంది. అది ఆకారానికి బ్రతికివున్న గుఱ్ఱం. గుఱ్ఱంకాదు. గుఱ్ఱం నీడ! కిందకి దిగి బండిని ముందుకి నెట్టాడు, బండి ఎక్కడికక్కడ ఊగులాడుతుంది. టపటపమని టాపులోంచి చినుకులు పడుతూనే వున్నవి. వాడు బండీలో పగిలిన అద్దంముక్కమీద ఊది, చూసుకున్నాడు. ఏం అవుపిస్తుంది? మీసాలు ఎగదువ్వుకున్నాడు. ఈసడింపుగా నవ్వి గుఱ్ఱాన్ని అన్నాడు:

"అరే లఛ్మన్! తుంకో దానా నై! హంకో ఖానా నై!"

కోటివెంకడు బండిని పెద్దబజారు సెంటరులో ఆపాడు. అయినా అంతవానలో పెద్దబజారు కెవడు వస్తాడు బండికోసం!

బండి నడుస్తోంది. రోడ్డు బోడిగా వుంది. ప్రాణాలుతీసుకు చచ్చే మనిషిలా వాన కురుస్తోనే వుంది. ఎదో సన్నగా లీలగా దూరంగా పాట వినిపిస్తోంది. రాగతాళధ్వనులు. ఆ గుంపు తడుస్తూనే పటంముందు జ్యోతి వెలుగుతూనే తెల్లవారు జామున జనసంచారంలేని పెద్ద బజారులో ఆగుతుంది. ఆ గుంపు పాడే పాట అంటుంది:

"నువ్వు ఈ కష్టసుఖాలని, ఈ జీవితాన్ని మరచిపో, ఒక్క ఆ దేవునియందే మనస్సు లగ్నం చెయ్యి."

తడుస్తున్న గుంపు ముందుకు సాగిపోతుంది. తారుమేఘాలు కమ్మిన ఆకాశంకింద కోటివెంకడు రెండుచేతులెత్తి దండం పెడతాడు.

"నాకు మూడు రూపాయలిప్పించు" ఇరుసు

విరిగిపోయేటంత శబ్దం చేసుకుంటూ బండిపోతుంది. "ఈ ముసురు ముండా మొయ్యి!" వాడి చూపు రోడ్డుమీదకి దించుకుపోతుంది.

ఊపిరి సలపకుండా వాన కురుస్తూనేవుంది. బండి స్టేషను చేరింది. గుంతకల్లు పాసింజరు వచ్చింది. అసలు దిగిన జనమే పలచనగావుంది. వాడు ప్రాధేయపడ్డాడు: "పట్కిలాసుగా పోతుంది జట్కా అయ్యగారూ జట్కా." సైకిలురిక్షాలు తంగుతంగుమని వర్షంలో దూసుకుపోయాయి. కోటివెంకడికి బాడిగ దొరకలేదు.

నిజానికి బండిటాపు అంతా కురుస్తుంది. గుర్రం వెనక్కి నడుస్తుంది. 'కాస్త' మర్యాదస్తుడెవడూ ఆ బండి ఎక్కడు. సందేహిస్తాడు. కనుక వాడికి బాడిగ దొరకలేదు.

వాడు కళ్ళు చికిలించి బండిలో అలాగే తడిసి ముద్దయి కూర్చున్నాడు. సన్నగా తలలోకి ఇనుప ఊచల్లా దిగుతోంది వాన. ఇంతట్లో తగ్గే ఇదేం కనిపించడంలేదు. వాడికి తనఇల్లు జ్ఞాపకంవచ్చింది. ఇంటిచుట్టూ గోడల మధ్యానికి నీరు నిలుస్తుంది. వాన రెండు రోజులు అలాగే నిలిచి కురిస్తే వాడికి కొంపగూడా లేకుండా పోతుంది. అలా మునివేళ్ల మీద కూచుని చంకన చంటిది కరుచుకుపోతే పెళ్ళాం వాడికోసం ఎదురు చూస్తుంది. వాడు తనమీద అక్కసు పట్టలేక గుర్రాన్ని తిడతాడు. తననితాను తిట్టుకుంటాడు. బహుశా అదిమాత్రం తిట్టుకోకుండా వుంటుందా వాడిని?" పీడిజిమ్మడ!"

రంగయ్య ఇంకా రాలేదు. వానవల్ల పొద్దు తెలియడంలేదు. కాంటీనుపక్కన నోరు చప్పరిస్తూ నిలబడ్డాడువాడు. "ఫట్కిలాస్ బండీ మహారాజ్!" వాడిమాటలు ఇంకా వాడిచెవుల్లో గింగురుమం టూనే వున్నవి. గుర్రం వొణుకుతుంది. వాడూ వొణుకుతాడు. బాడిగ దొరకదనే భయంవల్ల వాడికి వొణుకు మరీ ఎక్కువౌతుంది. రంగయ్య వస్తాడు. అర్థణా అరువేసి రంగయ్య దగ్గర రంగు కాఫీ తాగుతాడు. మళ్ళీ పన్నెండు గంటలకి కాని రైలురాదు.

ఇవాళ డబ్బులు దొరక్కపోతే ఇంట్లో అంతా పరగడుపే! రైలు ఆగింది. గేటుదగ్గర కోటివెంకడు ఆ 'మహారాజ్' పెట్టె లాక్కున్నాడు. సూరయ్య వాడికి పోటీ తగిలాడు. కోటివెంకడు వాడిమీదికి ఖంయ్‌మని లేచాడు. పెట్టె తీసుకెళ్ళి బండిలో పెట్టాడు.

"రండి మహారాజ్! ఫట్కిలాస్ బండి!" తీరా ఆ "మహారాజ్" సంకోచించాడు. సూరయ్య బండిమీద పడింది అతని కన్ను. "చూస్తారేం మహారాజ్. ఫట్కిలాస్‌గాపోతేనే డబ్బియ్యండి" ఆ మహారాజ్ మంచివాడిలా వున్నాడు. చక్కా వెనక్కి తిరిగివచ్చి వాడి బండియే ఎక్కాడు. సామాన్యుడి జీవితం గొడ్డలిపెట్టు. అయినా ఆవాల్టికి గండం గడిచినట్టే.

మూడు మైళ్లు పోవాలి. సూరయ్య అయితే మూడు రూపాయలైనా గుంజేవాడే. తను రెండుకే ఒప్పుకున్నాడు. తనేమైనా పేచీపెడతా డనుకున్నాడేమో, చెరువుకట్ట పక్కనుంచి ఎగుడు దిగుళ్లలోనుంచి పోవాలిగా మరి; ఆ 'మహారాజ్' 'రెండు రూపాయ లిస్తాను రావోయ్; మాట ఖరార్!" అన్నాడు.

కోటివెంకడు తను కప్పుకున్న గోనె తీసి బండి టాపుమీద కప్పాడు. తనకంటె 'మహారాజ్' ఘనాఘనం మరి! అయితే వాడు సవ్యంగా గమ్యంచేరిస్తే గదా ఆ రెండూ చేతిలో పడేది! అయితేనేం కోటివెంకడు తిమ్మాపురానికి లెక్కలే నన్నిసార్లు బండికట్టాడు. ఆ దోవ తనకి తెలియదు గనకనా! ఉష్!

అయితే బండి కదల్లేదు. గుర్రం కదల్లేదు. వాడు చర్నాకోలతో దాని చర్మం వొలిచాడు. అయినా గుర్రం కదల్లేదు. చావలేదు కూడా. కళ్లు పుసులుకట్టి కంటివెంట నీరుకారి అది ఏడిస్తే— అయినా అది ఏడ్చినా చచ్చినా ఎవడిక్కావాలి!- "మహారాజ్" జాలిగా అన్నాడు: "పాపం! దాన్నెందుకు చావగొడతావు!" "నువ్వండవయ్యా మహా తెలిసినట్టు మాట్లాడుతున్నావ్!" గుర్రం మీద కోపం అది. మహరాజ్ ముఖం చిన్న బోయింది.

కోటివెంకడు బండిదిగి, కళ్లెంపట్టుకుని గుర్రాన్ని లాగాడు. మూల్గుతూ వాడు పాదం ఎత్తితే గుర్ర బ్బండి మెల్లిగా రోడ్డుకి రెండువేపులా వున్న చెట్లు దూరాన కలిసిపోయేచోట — అదీ కలిసి పోతుంది.

ఆ రోజుకి వాడి జీవితం సాగిపోతుంది. ★